సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
సోమవారం, మే 13, 2024
డిజిటల్





# పోలింగ్ డే

2 లో

## పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

- పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు పొడగించిన ఎన్నికల కమిషన్
- 2 అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 547 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణ
- పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి
- ప్రలోభాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద పోలింగ్ సామగ్రి పంపిణీ సమయంలో అప్రమత్తంగా ఉండాలి
- సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ సెగ్మెంట్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్











# పోలింగ్ డే

## పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల ప్రతినిధి) :** జిల్లాలో లోక్ సభ ఎన్నికల పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి సిరిసిల్ల లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేములవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈ.వి.ఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వుపోలింగ్ సామాగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మీడియాతో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి మాట్లాడుతూ, మన జిల్లాలో ఉన్న 2 అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 547 పోలింగ్ కేంద్రాలలో 4 లక్షల 72 వేలకు పైగా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. జిల్లాలో ఉన్న ఓటర్లందరూ తప్పనిసరిగా మే 13న జరిగే పోలింగ్ లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కును



వినియోగించు కోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన చల్లని త్రాగునీరు, క్యూలైన్ల వద్ద టెంట్లు, టాయిలెట్ ఇతర వసతులు కల్పించామని అన్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన ర్యాంప్, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశామని అన్నారు.

వేసవి దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేకంగా కూలర్ ఏర్పాటు చేశామని, పారామెడికల్ బృందాలు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అందుబాటులో ఉన్నాయని, వీరికి అదనంగా మొబైల్ పారామెడికల్ బృందాలను సైతం సిద్ధం చేశామని కలెక్టర్ పేరు కొన్నారు. జిల్లాలోనీ పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు మన పోలీసు అధికారుల తో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు.

50శాతం పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించామని అన్నారు.

వేసవిలో ఎండల దృష్ట్యా భారత ఎన్నికల కమిషన్ పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు పొడగించిందని, సిరిసిల్ల వేములవాడ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ ముగిసిన తర్వాత రిసెప్షన్ కేంద్రాల వద్ద పోలింగ్ సామాగ్రి సేకరించి వాటిని కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ కాలేజీలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములకు తరలిస్తామని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో అధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా విస్తృతంగా ఓటు ప్రాముఖ్యత పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ లైవ్ సెక్టర్ ఆఫీసర్ జి.పి.ఎస్ ట్రాకింగ్ వాహనాల వివరాలు పరిశీలించారు.



### ప్రభుత్వ పాఠశాలలో 9,0 జీపీ ఉత్తీర్ణత సాధించిన

## విద్యార్థికి ప్రెస్‌క్లబ్ సన్మానం

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 2024 విద్యా సంవత్సరంలో పదోతరగతి వార్షిక పరీక్షలో 9,0 జ పి ఎ ఉత్తీర్ణుడైన ఎల్లారెడ్డిపేట మండల తెలంగాణ ప్రభ తెలుగు దినపత్రిక విలేకరి చేట్కూరి కృష్ణ మూర్తి గౌడ్ – రేఖ దంపతుల కుమారుడు చెట్కూరి అఖిల్ గౌడ్ ను ఎల్లారెడ్డిపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎండి మజీద్, సీనియర్ జర్నలిస్టు బండారి బాల్రెడ్డిలు కలిసి శాలువాలు కప్పి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మజీద్ , సీనియర్ జర్నలిస్టు బండారి బాల్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన జర్నలిస్టు సోదరుడు కృష్ణమూర్తి గౌడ్ రేఖలు కష్టపడి ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు కుమారులను చదివిస్తున్నారని పెద్ద కుమారుడైన అఖిల్ గౌడ్ 2024 విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్షలు రాసి వార్షిక ఫలితాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పురుషుల విభాగం నుండి 9.0 ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచినందుకు ప్రోత్సాహించేందుకు ప్రెస్ క్లబ్ తరపున ప్రెస్ మిత్రుడు చేటుకూరి కృష్ణమూర్తి గౌడును అతని తనయుడు అఖిల్ గౌడ్ లను సన్మానించడం జరిగిందని వారు తెలిపారు. ఇంటర్ లో వార్షిక పరీక్షలో కూడా ప్రథమ స్థానంలో రాణించాలని చదువులు నేర్పిన గురువులతో పాటు తల్లిదండ్రులకు ప్రెస్ క్లబ్ కు పేరు తేవాలని వారు పిలుపునిచ్చారు. రంగినేని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్ ప్రవేశ పరీక్షల్లో 80 శాతం మార్క్ లకు పైగా సాధించి ఇంటర్ ఫస్ట్ ఇయర్ , సెకండ్ ఇయర్ ఉచిత విద్యను పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జర్నలిస్టులు కొండ్లెపు జగదీష్, చింతకింది శ్రీనివాస్ గౌడ్ , శామంతుల అనిల్ కుమార్, కట్టెల బాబు , శ్రీధర్ గౌడ్ , మోహిజ్ , మనోజ్ కుమార్ యాదవ్ , కట్టెల సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సామాన్యుడి ఆయుధం
తెలంగాణ ప్రభ
www.telanganaprabha.com
సోమవారం
10.05.2024


# ప్రపంచ ప్రజల ఆరోగ్యంలో

# నర్సుల నిస్వార్ధ సేవ


## అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా

ప్రతి సంవత్సరం మే 12న, ప్రపంచవ్యాప్తంగా నర్సులు తమ అంకితభావం, కరుణ, నైపుణ్యాలను గుర్తించుకోవడానికి అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటాము. ఈరోజు ఆధునిక నర్సింగ్ కు పునాది వేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినం. ఈమె1853న లండన్ లో ఓ స్త్రీల ఆసుపత్రిలో సూపర్ ఇండెంట్గా పనిచేస్తూ. 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు సేవలు చేయటానికి నర్సుల బృందాన్ని తీసుకువెళ్లింది. 1859లో "నోట్స్ ఆన్ నర్సింగ్" అనే పుస్తకాన్ని ప్రచురించింది ఈమె ప్రపంచంలో మొట్టమొదటి నర్సింగ్ శిక్షణ కాలేజీని స్థాపించింది. ఈమె చేసిన సేవలకు గాను ఇంటర్నేషనల్ కౌన్సిలింగ్ ఆఫ్ నర్సింగ్ సంస్థ 1965 నుండి మే 12న ఫ్లోరెన్స్ నైటింగిల్ జన్మదినాన్ని అంతర్జాతీయ నర్సుల దినోత్సవం గా గుర్తించింది. ఈ రోజు మనం వారి త్యాగాలను స్మరించుకోవడానికి, వారి సేవలను గౌరవించడానికి ఒక ముఖ్యమైన అవకాశం. ఈ దినోత్సవం నర్సుల అంకితభావం నైపుణ్యం ప్రజల ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు వారి అమూల్యమైన సేవలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిన రోజు. నర్సుల కొరత పని ఒత్తిడి అసమాన వేతనాలు వంటి వృత్తిలోని సవాలను గురించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహన పెంచడానికి నర్సులు యొక్క యోగక్షేమాలను తెలుసుకోవడానికి, వారు సమాజానికి చేసే సేవతో పాటు వారి కుటుంబ బాధ్యతను కూడా ప్రభుత్వాలు అంతర్జాతీయ సంస్థలు గుర్తించి వారికి కావలసిన సామాజిక ఆర్థిక న్యాయం చేకూరేలా ప్రభుత్వాలు చేపట్టవలసిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నర్సులకు వారి కృషికి ధన్యవాదములు తెలియజేయటానికి మరియు వారి సేవలను ప్రశంసించడానికి ఇదొక మంచి అవకాశం.



### ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో నర్సుల సేవ

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచవ్యాప్తంగా నర్సుల సేవలను మెరుగుపరచడానికి కృషి చేస్తుంది. నర్సులకు శిక్షణ, మద్దతు, వనరులను అందించడం ద్వారా, ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య ఫలితాలను అందించడంలో వారి కీలక పాత్రను గుర్తిస్తుంది. నర్సింగ్ విద్య పరిశోధన అభ్యాసనాలను మెరుగుపరచటానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ కృషి చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మార్చిన పాత్రను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ బలోపేతం చేయటం వ్యాధుల నియంత్రణ ఆరోగ్య విద్యను ప్రోత్సహించడం వంటివిహాత్మక లక్ష్యాలను సాధించడంలో నర్సులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యా న్ని అందించటానికి ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచటానికి నర్సులు కీలక పాత్ర వహిస్తున్నారంటే దీనికి ప్రపంచ ఆరోగ్య సంస్థ వారికి కావలసిన చేయూతని ఇస్తుంది.అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నర్సులకు మన కృతజ్ఞతను తెలియజేయడానికి ఒక అవకాశం మాత్రమే కాదు, వారి పరిస్థితులను మెరుగుపరచడానికి, వారికి మరింత మద్దతు ఇవ్వడానికి మనం ఏమి చేయగలమో కూడా ఆలోచించే సమయం. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందించడంలో నర్సులు పోషించే కీలక పాత్రను గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. నర్సుల భవిష్యత్తు మెరుగ్గా ఉండటానికి కావలసిన సదుపాయాలు ప్రభుత్వాలు అందించాలి వారికి ప్రజలు కూడా సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భవిష్యత్తులోనూ ప్రజల ఆరోగ్యం శ్రేయస్ కోసం వారు చేసే అద్భుతమైన పనిని కొనసాగించటానికి మనం వారికి మద్దతు ఇవ్వాలి. ఇంకా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో ఆరు మిలియన్ మంది నర్సులు యొక్క అవసరం ఉంది. కాబట్టి నర్సులను మనం గుర్తించి ఆ విద్యను ప్రోత్సహిస్తూ వారికి కావలసిన సామాజిక ఆర్థిక చేయోతనం ఇవ్వవలసిన అవసరము ఆవశ్యకత ప్రభుత్వాలపై ప్రజలపై ఉందని గమనిస్తూ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా వారి సేవలను గుర్తు గుర్తు చేసుకోవాల్సిన అవసరం మనందరి బాధ్యత.



### దేశంలో నర్సుల సేవ

భారతదేశంలో, నర్సులు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ యొక్క వెన్నుముక. దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల నుండి నగరాల వరకు, అనేక రకాల ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో వారు పనిచేస్తూ, ప్రజలకు అవసరమైన సంరక్షణను అందిస్తారు. తల్లులు, పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ నుండి, ప్రమాదకరమైన వ్యాధుల చికిత్స వరకు, నర్సులు అనేక రకాల బాధ్యతలను నిర్వహిస్తారు. భారతదేశంలో నర్సుల సేవలను గుర్తించి భారత రాష్ట్రపతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటీగిల్ అవార్డును 1973 నుంచి నర్సింగ్ రంగంలో అత్యధిక సేవలు అందించిన నర్సులకు ఈ అవార్డును ఇవ్వటం జరుగుతుంది. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉత్తమమైన సేవలందించిన నర్సులకు ప్రశంస పత్రం జ్ఞాపకతో పాటు 50 వేల రూపాయలను అందించడం జరుగుతుంది.





### కొవిడ్ టైంలో నర్సుల త్యాగం

గత కొన్నేళ్లుగా, ప్రపంచం కొవిడ్-19 మహమ్మారితో పోరాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రజల ప్రాణాలను కాపాడారు. వ్యక్తిగత భద్రతను పణంగా పెట్టి అధిక పని ఒత్తిడిని అలసటను ఎదుర్కొంటూ రోగులకు కావలసిన సమయాన్ని వహించారు. ఈ కష్ట సమయంలో నర్సులు నిజమైన ధైర్యము చూపించారు. ఈ సమయం వారి వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి ప్రజల ప్రాణాలను కాపాడటానికి రాత్రింబవళ్లు శ్రమించారు. ఈ కష్ట సమయంలో, నర్సులు ముందువరుసలో పోరాడుతూ, ప్రాణాలను కాపాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఎనలేని సేవ చేశారు. వారు తమ స్వంత ఆరోగ్యాన్ని, భద్రతను పణంగా పెట్టి, రోగులకు అవసరమైన శ్రద్ధను అందించడానికి అవిశ్రాంతంగా కృషి చేశారు. వారి త్యాగం, సహనం నిజంగా అద్భుతమైనవి.





వి సాహితి విశ్లేషకులు
పూసపాటి వేదాద్రి
+91 99121 97694



## మూడు రోజుల్లో 1.42 లక్షల మంది ఆర్టీసీలో ప్రయాణం

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** సార్వత్రిక ఎన్నికల వేళ ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 1.42 లక్షల మంది ఆర్టీసీ బస్సులో ప్రయాణించారని టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ కు 59,800 మంది ప్రయాణించారని ఆయన వెల్లడించారు. సంక్రాంతి సీజన్ తో పోలిస్తే 10 శాతానికి పైగా ప్రయాణికులు ఆర్టీసీని వినియోగించుకున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు సొంతూళ్ళకు వెళ్ళే వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నగరం నుంచి అన్ని జిల్లాలకు 1500 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. అలాగే ఆంధ్రప్రదేశ్ వెళ్ళే ఓటర్ల కోసం 590 ప్రత్యేక బస్సులను తిప్పుతోంది.



## ఓటింగ్ కోసం 13 కార్డుల్లో ఏదైనా చూపించవచ్చు

**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళేటపుడు ఎపిక్ కార్డు లేని వారు 13 రకాల కార్డులలో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. ఓటర్ ఐడీ కార్డును పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్ళకపోతే ఏమీ ఆందోళన చెందనసరం లేదు. ఎన్నికల సంఘం ఇచ్చిన సడలింపుల మేరకు ఓటర్ ఐడీ కార్డు లేకపోతే దానికి బదలుగా ఆధార్ కార్డు, ఎం.ఎన్.ఆర్.ఇ. జి.ఏ.జాబ్ కార్డు, ఫోటోతో ఉన్న బ్యాంక్/పోస్ట్ ఆఫీస్ పాస్ బుక్ , కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ , పాన్ కార్డ్ , కార్మిక మంత్రిత్వ శాఖ పథకం ద్వారా జారీచేసిన స్మార్ట్ కార్డు , పాస్‌పోర్ట్ , ఫోటోతో ఉన్న పెన్షన్ డాక్యుమెంట్ , కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు, యూనిక్ డిసెబిలిటీ గుర్తింపు కార్డు వంటి కార్డులలో దేనినైనా చూపించి ఓటు వేయవచ్చు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని, ఓటింగ్ శాతాన్ని పెంచాలని ఈ సందర్భంగా ఎన్నికల సంఘం కోరింది.

# రాష్ట్రంలో గాలివాన బీభత్సం

- పిడుగుపాటుకు ముగ్గురు మృతి
- మెదక్ లో ఇద్దరు, ఆదిలాబాద్ లో ఒక్కరు మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు, ఒకరి పరిస్థితి విషమం
- పలుచోట్ల దెబ్బతిన్న పంటలు
- అప్రమత్తంగా ఉండాలని ఆదేశించిన సీఎం రేవంత్







**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాల కారణంగా తీవ్రంగా పంట నష్టం జరుగుతోంది. పిడుగుపాడుకు నలుగురు మృతి చెందారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల పరిధిలోని రామోజీ పల్లి గ్రామంలో పిడుకుపాటుకు గుర్రై తండ్రి, కొడుకు మృతి చెందారు. స్థానిక ఐకెపి సెంటర్లో ఆర బోసిన వరి ధాన్యం వర్షం కురిసి తడుస్తోందని టార్పాలిన్లు కప్పడానికి వెళ్లిన రైతు పాల్వంచ శ్రీరాములు(50), ఆయన కొడుకు విశాల్ (11) ఆదివారం పిడుగు పడి మృతి చెందారు. వరికుప్పపై టార్పాలిన్ కప్పారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో చెట్టు కిందకు తాత మనవడు కలిసి వెళ్ళారు. వీళ్ళు ఉన్న చెట్టుపై పిడుగుపడటంతో అక్కడికక్కడే శ్రీరాములు, విశాల్ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలం గిమ్మ గ్రామ శివారులో పిడుగుపాటుకు అయిదుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. వీరిలో గిమ్మ గ్రామానికే చెందిన మామిడిపల్లి కిరణ్ అనే వ్యక్తి మృతి చెందటం స్థానికంగా విషాదం నింపింది. ఎంపీటీసీ సభ్యుడు కోల భోజన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమేష్, ఉప సర్పంచ్ భర్త రమేష్‌లకు గాయాలవ్వగా, సంటెన్న అనే మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులందరినీ హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.



### డీబీఆర్ కేంద్రంలో కూలిన టెంట్లు

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గాలి, ఉరుముల మెరుపులతో భారీగా కురుస్తున్న వర్షంతో జిల్లా కేంద్రం అతలాకుతలం అయింది. జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం (డీబీఆర్) లో టెంట్లు పూర్తిగా కింద పడిపోయినాయి. దీంతో టెంట్ కింద ఉన్నటువంటి ఎన్నికల సిబ్బంది పాఠశాల గదులలోకి వెళ్లి తలదాచుకున్నారు. వర్షంలోనే ఎన్నికల సిబ్బంది ఎన్నికల సామాగ్రిని తీసుకుని బస్సులలో బయలుదేరారు.

### గాలివాన, పిడుగుల నష్టంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా

ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాతో పాటు ఇతర జిల్లాలో గాలివాన, పిడుగుల వలన సంభవించిన నష్టంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనాథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో పిడుగుపాటుకు ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోతే, రైతులు ఆందోళన చెందవద్దని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

# నిర్భయంగా ఓటేయండి

- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు
- మొత్తం 73,4141 మందితో బందోబస్తు : డీజీపీ రవిగుప్తా



**తెలంగాణ ప్రభ, హైదరాబాద్ :** రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని డీజీపీ రవి గుప్త ప్రకటించారు. మొత్తం 73,414 మంది పోలీసులకు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలను నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. 500 తెలంగాణ స్పెషల్ ఫోర్స్ విభాగాలు సహా.. 164 సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌తో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు. అలాగే 7వేల మంది ఇతర రాష్ట్రాల హోంగార్డులతో బందోబస్తు నిర్వహి స్తున్నా మని, 89 ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులు, 173 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రూ.186కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని, తనిఖీలకు సంబంధించి 8,863 కేసులు నమోదు చేశామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కేంద్ర బలాలతో భద్రత ఏర్పాటు చేసామన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా కోసం ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ వింగ్ ఏర్పాటు చేశాం. రాష్ట్ర సరిహద్దుల్లో పారామెలిటీ బలగాలతో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు.